# తగిన శాస్తి

అది ఒక షరా 'మామూలు' ఆఫీసు. అక్కడికి ట్రాన్స్‌ఫరై ఊడి పడ్డాడొక క్యారెక్టర్. ఆక్యారెక్టర్‌కి తగిలించబడ్డ పేరు గోపాలం. మహా సరదారాయుడు అతగాడు. అలాగే ఎంచక్కా ప్రాక్టికల్ మనిషి కూడా!

గోపాలం బస్సు దిగి సరాసరి ఆఫీసులోకే అడుగుపెట్టాడు. ఎందుకైనా మంచిదని సెంటిమెంటల్‌గా అత్తారింట్లోకి తొలిసారిగా కాలుమోపే కొత్త పెళ్ళి కూతుర్లా కుడికాలు ముందు పెట్టాడు. ఎడం కాలు కూడా సినిమాల్లో స్లోమోషన్‌లా మోపేసరికి గోపాలానికి ఎదురయ్యాడో శాల్తీ.

"నమస్కారం సార్!" అని కూడా అన్నాడు. 'హిహి' అని పళ్ళికిలిస్తూ.

బదులుగా 'నమస్కారం సార్!' అని విష్ చేసి, ఇక్కడి పద్ధతి ఇలాగేనేమో ఫాలో అవకపోతే బావుండదని అచ్చు ఎదుటి వ్యక్తిలాగే తనుకూడా 'హి....హి...' అంటూ అతనికంటే ఎక్కువే పళ్ళికిలించాడు.

"నేనిక్కడ అటెండర్ని సార్!" అన్నాడతను. ఈ ఆఫీసుకి జి.యమ్. నన్నంత ఇదిగా బిల్డప్ ఇస్తూ.

గతుక్కుమన్నాడు గోపాలం.

'చూస్తే టక్కూ - గిక్కూతో మనిషి మాంచి పొజిషన్లో ఉన్న వ్యక్తిలా కన్పిస్తే... ఎవరా అనుకున్నా ! వార్నీ వీడి దుంపతెగ. అటెండర్‌గాడా?' అని మనసులో కసిగా తిట్టుకున్నాడు.

'తనని చూసి ఆఫీసు పనిమీదొచ్చిన ఎవరో, గొట్టంగాడని ఈఁగురుడు గాలం పట్టుకుని వచ్చుంటాడు చిక్కుతానేమోనని!' అనుకుని అటెండర్ వంక కొరకొరా చూశాడు గోపాలం.

వినయంగా చేతులు కట్టుకొని, ప్రపంచంలో తనకంటే ఇన్నోసెంట్ మరెవరూ లేరన్నంతిదిగా ఫోజొకటి విసుర్తూ 'మీకేం కావాల్సార్!' అనడిగాడు ఎదురుగా నిలబడి.

"వేడి వేడిగా ఏం ఉన్నాయ్?" కచ్చ కచ్చగా అడిగాడు పళ్ళు నూరుతూ.

"ఇది హోటల్ కాద్సార్!" అన్నాడా అటెండర్ పకపకా నవ్వుతూ.

"మరెందుకలా సర్వర్‌లా నిలబడి మీకేం కావాల్సార్? అనడిగావ్!" రుసరుసలాడాడు గోపాలం.

గుటకలు మింగాడా అటెండర్.

పొద్దున లేవగానే పిల్లి ఎదురైనట్టు వీడు తగలడ్డాడేం? అయినా ఆఫీసులోకి అడుగు పెట్టగానే ఇలాంటి అటెండరెదురవడం ఈ శతాబ్దపు అతి పెద్ద అపశకునంగా ఫీలవుతూ...

"నాకు ఆఫీసర్‌గారు కావాలి." అన్నాడు శాంతంగా.

"ఎందుకు సార్?" విషయమేంటో తనకి చెబితే చిటికెలో పనైపోతుందిగా! మధ్యలో ఆయనెందుకున్నట్లు చూపొకటి విసిరాడు.

"జాయినింగ్ రిపోర్టిద్దామని" తాపీగా చెప్పాడు.

"అంటే, మీరు..." వాయిస్ మార్చి సన్నగా గొణిగాడు.

"అవును నేనే!" అని ఆగాడు.

"కరీంనగర్ నుండి బదిలీయై వచ్చిన గోపాలం సారా?" ప్రశ్నించాడు.

అవునని తలూపుతూ "ముందు కాసిన్ని మంచి నీళ్ళుకావాలి" అడిగాడు గోపాలం.

"కాసిన్నేం ఖర్మ? కావల్సినన్ని తాగండి. అదిగో అక్కడుంటాయి సార్ నీళ్ళు." అన్నాడు. స్టాఫే కదా సర్వ్ చేయాల్సిన అవసరం లేదన్నంత ధీమాగా.

'అమ్మో! ఇక్కడి అటెండర్లకి పనులేం చెప్పకూడదు గావోును'ని నాలిక్కరుచుకుంటూ అటుగా వెళ్ళి అక్కడున్న గ్లాసుల్లో ఓ గ్లాసు తీశాడు వాటర్ వంపుకుని తాగుదామని.

దూరం నుండి గోపాలం చర్యల్నే 'డైనోసర్'లా గమనిస్తోన్న అటెండర్ 'అనకొండ'లా దూసుకు వచ్చాడతని చెంతకు.

"సార్సార్! ఆ గ్లాస్ మాత్రం ముట్టకండి" అన్నాడు దానివంక భయం భయంగా చూస్తూ.

"ఎందుకని?" ఆశ్చర్యపోయాడు గోపాలం.

"ఆ గ్లాసునోసారి చూడండి" అని చెప్పేసి తుర్రుమన్నాడక్కడి నుండి.

గ్లాసుని చూడ్డమేంటబ్బా? కొంప దీసి ఇది పురావస్తు శాఖ వారి తవ్వకాల్లో లభించిన

ఫలానా నైజాం ప్రభువు కాలం నాటిది కాదుకదా! ఎందుకైనా మంచిదని చాలా జాగ్రత్తగా దాన్ని పరికించి పరికించి చూశాడు. దానికో స్టిక్కర్ అతికించబడి ఉంది.

'ఈ గ్లాసు నాది. దీంతో ఎవరూ మంచి నీళ్ళు తాగరాదు'

-సూపరింటెండెంట్

అని ఉంది. అచ్చూసి బిత్తరపోయాడు గోపాలం. అదేం టైపో అర్థమవక గింజుకున్నాడు. గ్లాసు మీద రాతలేంటి వింతగా? అయినా ఇవన్నీ తనకెందుకులే అనుకుని ఆ గ్లాసక్కడే ఉంచేసి మరొక గ్లాసుతో పని పూర్తి చేసుకున్నాడు.

తర్వాత సరాసరి బాస్ గదిలోకి 'కమాండో'లా దూరి జాయినింగ్ రిపోర్టివ్వడం తదితర ఫార్మాలిటీస్ పూర్తి చేసుకున్నాడు. సెక్షన్ అలాట్‌మెంట్ కాలేదింకా. రేపప్పగిస్తానని చెప్పాడాఫీసర్.

సరేలెమ్మని గదిలోంచి బయటపడ్తుంటే ఎదురయ్యాడొక వ్యక్తి. క్యాషియర్‌గా తనని తాను పరిచయం చేసుకున్నాడతను.

గోపాలం నుదురుకున్న ప్లస్‌మార్క్ స్టిక్కర్ వంక ప్రపంచపు ఎనిమిదవ వింతలా మార్చి మార్చి చూస్తూ "ఆక్సిడెంటా?" అనడిగాడు క్యూరియాసిటీగా.

గోపాలం బయోడాటా ఏంటో ఆఫీసులో అందరికంటే ముందుగా తనే తెల్సుకుందామని తెగ ఉత్సాహపడిపోతున్నాడతను. ముసిముసిగా నవ్వుతూ పక్కనున్న కుర్చీలో కూర్చోబోయాడు గోపాలం.

'వద్దూ! అనో కేక హర్రర్ సీన్ చూసినవాడిలా...

క్యాషియర్ నోటి నుండి వెలువడింది.

ఆ కేకకి జడుసుకున్న గోపాలం కూచోబోతున్న వాడల్లా భయంతో చివ్వున లేచి నిలబడ్డాడు.

'ఏ... ఏ... ఏం జరిగిందండీ? అనడిగాడు గోపాలం అయోమయంగా.

"ఇంకా ఏం జరగలేదు. కూచుంటే జరిగుండేది. ఒక్కసారా కుర్చీ వంక చూడండి." అన్నాడు క్యాషియర్.

"ఓస్ అంతేకదా. ఒకసారేంటి ఎన్నిసార్లయినా చూస్తాను. చూడ్డమేగా?" అని చూశాడు కాస్తవంగి.

'ఈ కుర్చీనాది. ఇందులో ఎవరూ కూర్చోరాదు.'

-సూపరింటెండెంట్

అని, సేమ్ టు సేమ్ ఇందాకటి లాంటి స్టిక్కర్ అతికించబడి ఉంది.

గోపాలం విస్తుపోయాడు.

"ఏంటండీ! ఈ చిత్ర విచిత్ర గందరగోళ వ్యవహారం. ఎవరా సూపరింటెండెంట్.. ఏమా కథ...?" అనడిగాడు క్యూరియసిటిగా.

"ఆయనది మహా గొప్ప క్యారెక్టర్ లెండి. ఎవరితో కలవడు. ఎవర్నీ తనతో కలవనీయడు. గత ఇరవై ఏళ్ళ నుండీ ఇదే ఆఫీసులో ఫెవికాల్‌తో అతికించబడినంతిదిగా అతుక్కుపోయాడు. పేరుకే అతను బాస్. పెత్తనమంతా ఈయన్దే! ఎదుటి వాళ్ళంటే చిన్నప్పటినుండీ చిన్న చూపట. ఆయన వాడే వస్తువులెవరూ తాకన్తైనా తాకకూడదని ఈ విధమైన ఏర్పాటు."

"ఇంతకీ ఏడీ ఆ మయాఫకీర్?" నాలిక్కరుచుకుంటు "ఆ మహానుభావుడు అనడిగాడు?"

"ఈ రోజు సెలవులో ఉన్నాడు. ఎవరైనా అతగాడి వస్తువుల్ని తాకినట్టు తెలిసిందో ఊర్కోడు. నానా హంగామా చేస్తాడు. మన సాలరీ పేబిల్స్‌లో అవకతవకలు సృష్టించి డబ్బు కట్ చేయిస్తాడు."

"అయినా తెలిస్తేనే కదా! ఎలా తెలియనిస్తాం?"

"తెలుస్తుంది. పాకిస్తాన్ ఏజెంట్‌కి స్వంత భాయీలా మన అటెండర్ గాడున్నాడండీ బాబూ! దుస్తుల్ని వదలని జిడ్డులా అస్తమానం మనల్ని కనిపెడుతూనే ఉంటాడా వెధవ."

మరెక్కడ కూచోవాలా అని చూపులు సారించాడు గోపాలం. మహిళా టైపిస్ట్ పక్కన ఖాళీ కుర్చీ ఒకటి చిరునవ్వు లొల్కుతూ కన్పించింది.

హుందాగా అటువైపు కదిలాడు. క్యాషియర్ ఎప్పట్లా తన పనిలో తాను మునిగిపోయాడు.

చేస్తోన్న పనాపి మరీ గోపాలం వంక గుడ్లప్పగించి చూసిందా మహిళా టైపిస్ట్. ఆమె పేరు సుమతి.

ఆమె చూపులు గోపాలానికి 'అదోలా' అన్పించాయి. మనిషి బిర్ర బిగుసుకు పోయాడు.

పైగా "నేనలాంటి వాడ్ని కాదండీ!" అన్నాడు బోల్డు సిగ్గుపడిపోతూ.

అచ్చెరువొందింది సుమతి.

"ఎట్టాంటి వారు కాదు?" అనడిగింది అనుమానంగా చూస్తూ.

"పక్కా సతీవ్రతుణ్ణి" చెప్పాడతను.

"ఇంకా..." ఎకసెక్కెంగా అంది.

"సంసారి టైపునండీ!" అన్నాడు మెల్లగా అమెకు మాత్రమే వినపడేలా.

"అబ్బో... నాకూ ఉంది సంసారం" అంది మూతి మూడు వంకర్లు తిప్పుతూ.

"అయితే ఆపనేంటండీ?" అన్నాడు సుమతి అందాల వంక లొట్టలేయకుండా అటేటో చూస్తూ.

అప్పుడు చూసుకుంది తన పైటవైపు.

అంతే! కెవ్వుమని అరిచింది. రేప్ సీనేదో జరిగిపోయినట్లు.

పైట తొలగి, సెన్సార్ కత్తెర ససేమిరా సహించని సీన్‌లా ఉందా ప్లేస్ చప్పున కొంగు కప్పేసుకుంది.

ఇందాక కిందపడ్డ కార్బన్ పేపరు తీసుకొనేటప్పుడు వంగినందుకు పైట జారి ఉంటుంది. కొంగు పిన్నూడ్డం గమనించలేదు తను.

ఇచ్చూసి ఈయనగారు ఏదేదో ఊహించేసుకొని ఉంటాడనుకొని పళ్ళు పటపట లాడించింది చేసేదేం లేక.

ఆమె వాలకం అర్థమైచావక వెళ్ళి ఆమె పక్క సీట్లో కూలబడ్డాడు.

తన జేబులోంచి బాస్ ఇచ్చిన చార్జింగ్ ఆర్డర్ కాపీని బయటకి తీశాడు. ఏ రోజు ఈ ఆఫీసులో జాయినయ్యిందీ, తదితర వివరాలు తెల్పుతూ హెడ్డాఫీసుకి వివరాలు పంపించాల్సి ఉంటుంది.

ఖాళీగా ఉండడమెందుకని ఎదురుగా ఉన్న ఫైల్లోంచి ఓ తెల్ల కాగితం తీసి ఆ పని పూర్తి చేయాలనుకొని పెన్ కోసం జేబంతా గాలించాడు దొరకలేదు. హడావుడిలో మరచిపోయుంటానని టేబుల్ మీదున్న పెన్ తీసుకున్నాడు.

"సార్సార్! దాన్ని తాక్కండి. డేంజర్" అనరిచాడు పక్కాయన.

కెవ్వుమని కేకవేసి షాక్ కొట్టినట్టె దాన్ని విదిలించాడు గోపాలం. అతనెందుకలా అరిచాడో కాస్త ఆలస్యంగా అర్థమైందతనికి.

"ఇది కూడానా?" అని వాపోతూ ఆ పెన్‌ని చేతిలోకి తీసుకొని జాగ్రత్తగా పరిశీలించాడు.

దానిక్కూడా ఇందాకటిలా వెరీ స్మాల్ స్టిక్కర్ సేమ్ మ్యాటర్‌తో అతికించబడి ఉంది. కళ్ళు చిట్లించి చూస్తేగానీ అక్షరాలు అతనికంటికి ఆనలేదు.

'ఈ కలం నాది దీంతో ఎవరూ రాయరాదు'.

-సూపరింటెండెంట్

అచ్చూసి పూనకం వచ్చినవాడిలా ఊగిపోతూ జుత్తు పీక్కున్నాడు కసిగా.

ఏవిటీ పిచ్చి మాలోకం? ప్రతిదీ అంటరాదు, తాకరాదు, నాది అంటూ రాసేస్కున్నాడు. వీడికిదేం రోగమని పళ్ళు నూరుకుంటూ ఆ పెన్‌ని భద్రంగా అక్కడే ఉంచేసి, పక్కాయనిచ్చిన పెన్‌తో పని చేసేస్కున్నాడు.

ఆ కాగితం మీద ఆఫీస్ స్టాంప్ వేద్దామని స్టాంప్ పాడ్ తీసాడు.

'ఏడనున్నాడో నా రాజు ఎక్కడున్నాడో గానీ...'

"సార్....పులి బోన్లో తల పెడ్తున్నారు" అంటూ గావు కేక పెడుతూ పరుగెట్టుకొచ్చాడు అటెండర్ మహాశయుడు.

స్టాంప్ పాడ్ చేత్తో ముడితే ఈ ఆఫీసులో తప్పా? ఇదేం ఆఫీసురా బాబూ అని గుణుస్తూ చప్పున దాన్ని వదిలేశాడు.

'దానికున్న అందమైన స్టిక్కర్ మీ కళ్ళకు అగుపించడం లేదా సార్! అంటూ రెడ్ సిగ్నల్ ఇచ్చేసి వచ్చినంత వేగంగా తుర్రుమని పారిపోయాడా అటెండర్.

వీడి దుంపతెగ! 'గాడ్జిల్లా'లా నావెంట పడుతున్నాడేంటని తల పట్టుకున్నాడు గోపాలం

స్టాంపింగ్ పని తర్వాత చూడొచ్చని టేబుల్ మీద పేపర్ పడేసి, అది ఎగిరిపోకుండా పేపర్‌వెయిట్ తీశాడు.

ఎందుకైనా మంచిదని దాన్నో మారు తిప్పి తిప్పి చూశాడు.

అంతే... అదిరిపడ్డాడు గురుడు!

దానికున్న స్టిక్కర్ తిరిగి వెక్కిరించందతన్ని.

'ఈ పేపర్ వెయిట్ నాది. దీన్నెవరూ ఉపయోగించరాదు'.

-సూపరింటెండెంట్

ఆ అక్షరాలు చూసి ధామ్మని విరుచుకుపడి పోయాడు గోపాలం.

శ్రీ శ్రీ శ్రీ

ఆఫీసులోకి అడుగుపెడుతూనే అచ్చెరువొందాడు అటెండర్. గత వారం రోజుల నుండి సెలవులో ఉన్నాడు. ఆఫీసులో ఏదో ఏదో తెలీని కొత్త మార్పేదో కల్గినట్టు అతగాడికి అనుమానం కల్గింది. వాసన పసిగట్టడంలో పర్‌ఫెక్ట్ మనిషతడు.

కల్లు తాగిన కోతిలా ఆఫీసంతా గాలించి గాలించి వెతికాడు. మ్యాసేమైనా తెలియక పోతుందాని. తనాఫీసు తనకే కొత్త కొత్తగా అన్పిస్తోందతనికి.

కథేంటాని ఆరా తీస్తే-

సూపరింటెండెంట్ గారిన్నాళ్ళు ఆఫీసులో అందర్నీ వెలేసినట్లు చూస్తూ తనకంటూ సెపరేట్‌గా వస్తువుల్ని ఉంచేసుకుంటే.. ఇప్పుడంతా గోల్‌మాలయ్యింది వ్యవహారం. స్టాఫంతా కల్సి సూపరింటెండెంట్ గారినే వెలేసినట్టు చూస్తున్నార్ట. చెంతకూ వెళ్ళి ఆయన్ని కలవాలంటే జంకుతున్నార్ట!

ఇదెలా జరిగుంటుందాని తెగాలోచించాడు. అలా చించీ చించీ తలమీదున్న ఆ కాస్త రెండు మూడు వెంట్రుకల్ని కాస్తా పీక్కున్నాడు.

కొద్ది క్షణాల్లోనే ఆ మిస్టరీ కాస్తా వీడిపోయింది.

అదెలాగంటే-

యమ హుషారుగా గోపాలం క్యాషియర్‌తో అంటున్నాడిలా...

"మన సూపరింటెండెంట్ గారి లాంటి వింత వింత క్యారెక్టర్స్ ఎక్కడైనా

తగుల్తుంటారు. ఇలాంటి వారి పిచ్చి వదలగొట్టాలంటే కీలెరిగి వాతపెట్టడమే సరైన ట్రీట్‌మెంట్ తగిన శాస్తి జరిగింది మహానుభావుడికి".

వాళ్ళ సంభాషణని రహస్యంగా చెవిలో పడేస్కున్న అనంతరం... పక్కా సాక్ష్యాధారాలు దొరికినట్టు... కొన్ని స్టిక్కర్స్ కూడా దొరికాయి అటెండర్‌కి. వాటిని చూసి మూర్ఛరోగిలా గిలగిలా తన్నుకోసాగాడు.

ఆ స్టిక్కర్సన్నీ ఇలా ఉన్నాయి.

అందులో ఒకటి-

"ఈ గ్లాసు నాది దీంతో ఎవరూ మంచి నీళ్ళు తాగరాదు. ఎందుకంటే నాకు ఎయిడ్స్ కాబట్టి".

-సూపరింటెండెంట్.

(20.02.2002)